తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

నవంబరు 2020.

సప్తగిరి అనుబంధం






మునివాహనుడు

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 | నవంబరు 2020 | సంచిక: 09

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | సిరులిచ్చేశ్రీలక్ష్మి – డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 32 |
| పన్నిద్దరాళ్వార్లు | తిరుప్పాణాళ్వార్ – ఆచార్య కె.సర్వోత్తమరావు | 34 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీప్రసన్నవేంకటదాసులు – శ్రీ దేసు వెంకటసుబ్బారావు | 36 |
| చిత్రకథ | పద్మసరోవరం<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కె.ద్వారకనాథ్ | 38 |
| బాలనీతి | మాటే మంత్రం – ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి | 42 |
| విశిష్టబాలిక | | 44 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ కంపల్లె రవిచంద్రన్ | 45 |
| చిత్రలేఖనం | | 46 |


ముఖచిత్రం : సిరులిచ్చేశ్రీలక్ష్మి

వెనుక చిత్రం : నరకాసుర సంహారం

# సిరులిచ్చే శ్రీలక్ష్మి

-డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు, 98499 15351

త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువు స్థితికారుడు. అంటే అందరినీ నడిపించేవాడు- ఆ దేవదేవుడే! అలాగే త్రిమూర్తుల దేవేరులలో శ్రీమహాలక్ష్మికే అగ్రస్థానం. ఈ తల్లిమీదే ప్రపంచం మొత్తం ఆధారపడి ఉంది. ఈ లక్ష్మీదేవి విద్యాలక్ష్మిగా వ్యాపిస్తే ఆమె సరస్వతీదేవే అవుతుంది. అదే ధైర్యలక్ష్మిగా సాక్షాత్కరిస్తే ఆమె పార్వతీదేవే అవుతుంది. ఈ కారణంచేత మహాలక్ష్మిని పూజిస్తేచాలు విద్య, సంపద, ధైర్యం అన్నీ ఒనగూడుతాయి.

లక్ష్మీదేవి అంటే శుభసంకేతం. అందుకే 'అదృష్టలక్ష్మి' అని పిలవడం పరిపాటి. ఈమె సౌందర్యలక్ష్మికూడా! లక్ష్మీదేవి అష్టలక్ష్ములుగా సుప్రసిద్ధురాలు. అష్టలక్ష్ములుగా ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి లోకోత్తరమైన ప్రశస్తిని పొందారు. ఈమె పద్మప్రియ. విష్ణుప్రియ. జగన్మాతగా కొనియాడబడే ఈమెను రమ అనీ, ఇందిర అనీ జనసామాన్యమంతా పిలుస్తూ ఉంటారు.

ఒకప్పుడు దుర్వాసమహర్షిశాపంకారణంగా దేవతలకు వృద్ధాప్యం వచ్చేసింది. ఫలితంగా ఇంద్రుడు స్వర్గలోకాధిపత్యాన్ని కోల్పోయాడు. దీంతో స్వర్గలక్ష్మి స్వర్గాన్ని వదలి, వైకుంఠం చేరింది. ఈ కారణంగా స్వర్గంకళ తప్పింది. దీంతో దేవతలందరూ వెళ్లి, శ్రీమహావిష్ణువుకు మొరపెట్టుకున్నారు. లక్ష్మీకటాక్షం కలగాలని, తమకు వార్ధక్యం పోయి నిత్యయౌవనం చేకూరాలని వేడుకున్నారు. అందుకు సమ్మతించిన శ్రీమహావిష్ణువు క్షీరసాగరమథనానికి నాంది పలికాడు. తాను కూర్మమూర్తియై ఆ మథనానికి మూలంగా నిలిచాడు. లక్ష్మీదేవిని క్షీరసాగరకన్యగా అవతరించమని ఆదేశించాడు. లక్ష్మి ఆవిర్భవించింది. అమృతమూ వచ్చింది.

దేవతలూ నిత్యయౌవనులైనారు. లక్ష్మీదేవిదయ కలగడంతో స్వర్గానికి మునుపటికళ వచ్చింది. ఇంద్రుడికి సింహాసనమూ దక్కింది.

శ్రీమహావిష్ణువు ఎన్నో అవతారాలు ధరించినప్పుడు శ్రీమహాలక్ష్మి కూడా ఆ స్వామితోపాటు పలు అవతారాలు ధరించింది. ఆదివరాహుడిగా శ్రీమహావిష్ణువు అవతరించినప్పుడు లక్ష్మీదేవి భూమాతగా అవతరించింది. శ్రీనృసింహావతారంలో లక్ష్మీదేవి చెంచులక్ష్మిగా ముందు నిలిచింది. శ్రీరామావతారంలో సీతగా, శ్రీకృష్ణావతారంలో రుక్మిణిగా జన్మించింది. విష్ణుమూర్తి శ్రీవేంకటేశ్వరుడైతే ఆమె పద్మావతి అయింది. కొల్హాపూర్‌లో లక్ష్మికూడా కొలువై భక్తులపాలిట కొంగుబంగారమైంది!

మొత్తంమీద ఆదిలక్ష్మి అనంతశక్తిస్వరూపిణి. పరబ్రహ్మ స్వరూపిణి. ఆమె కృపకలిగితే సర్వం సిద్ధిస్తుంది. అయితే చిత్తశుద్ధితో, ఆత్మవిశ్వాసంతో శ్రమించేవారికే ఆమె కృప కలుగుతుందని లోకశ్రుతి.



అందుకే కష్టపడి పనిచేయాలి. కష్టజీవులు లక్ష్మిని స్వాగతించనక్కర లేదు. ఆ తల్లే ఎదురు వచ్చి ఆదరిస్తుంది. ఇది ఆర్యోక్తి.

"శ్రమజీవికి జగమంతా లక్ష్మీనివాసం"

పన్నిద్దరాళ్వార్లు

# తిరుప్పాణాళ్వార్

- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ఆళ్వారులనేవారు 'పాశురాలు' అనే పేరుతో అర్చావతారాలను కీర్తించినవారు. వారిలో 'తిరుప్పాణ్ ఆళ్వార్' ఒకడు. కావేరినదీతీరంలో కూర్చొని, తన్మయత్వంతో శ్రీరంగనాథుణ్ణి కీర్తించే సామాన్యభక్తుడు ఇతడు.

ఆలయకైంకర్యాలలో 'తోయకైంకర్యం' (నీళ్లు తెచ్చే సేవ) ఒకటి. స్వామి అభిషేకానికి కొండల నుండి జాలువారే జలపాతజలాన్నో లేదా నదులలో నిర్దిష్టస్థలంలో పారే జలాలనో కుంభాలతో ఆలయఅర్చకులు తీసుకునిపోవడం సంప్రదాయం. ఒకసారి శ్రీరంగనాథస్వామి ఆలయ అర్చకుడు లోకసారం గుడు అభిషేకజలంకోసం వచ్చాడు. తేరిపార చూచాడు. ఆ నదీతీరంలో గానం చేస్తూ తన్ను మరచిన తిరుప్పాణ్‌ను చూచాడు. సంప్రదాయం ప్రకారం పవిత్రజలం తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో లోకసారంగుడు తిరుప్పాణాళ్వార్‌ను గద్దించాడు. బాహ్యస్మృతిలేని పాణార్‌కు ఆ గద్దింపు కూతలు వినబడలేదు. తాను కేకలేసినా వినని 'పాణార్' పై కోపం వచ్చింది. అహంకారం మానవత్వాన్ని మరచేటట్లు చేసింది. ఒకరాయి తీసుకొని అతనిపై లోకసారంగుడు విసిరాడు. ఆ తర్వాత అభిషేకజలం తీసుకొని, లోకసారంగుడు ఆలయానికి కదిలాడు.

గర్భాలయం ప్రవేశించిన లోకసారంగుడు స్వామివిగ్రహాన్ని చూచి గతుక్కుమన్నాడు. స్వామిమొగాన నెత్తురుకారడం చూచి, స్వామి సేవలో ఏదో అపచారం జరిగిందని వణకసాగాడు. "స్వామీ! క్షమించు. నేను పాపిని" అని దీనాతిదీనంగా మొఱపెడుతూ నేల వాలిపోయాడు.

రంగనాథుడు లోకసారంగమునికలలో కనబడి "లోకసారంగా! నీవు ఆత్మీయుడివి. అంతేకాదు 'తిరుప్పాణ్' నాకు అత్యంతఆత్మీయుడు. నీది అర్చనకైంకర్యం. అతనిది గానకైంకర్యం. అతడు సామాన్యుడు కాడు.

నీవు రాళ్లతో కొట్టినదెబ్బలు నా శరీరానికి తగిలాయి. నా భక్తుణ్ణి నీవే ఆలయానికి తీసుకురా" అన్నాడు. సారంగముని తటాలున లేచాడు. తన తప్పిదం ఏదో తెలుసుకొన్నాడు. స్వామికోరిక, ఆంతర్యం అర్థంచేసుకొన్నాడు. కావేరీతీరానికి కదిలాడు. తిరుప్పాణాళ్వార్‌కు సాష్టాంగనమస్కారం చేశాడు. తన తప్పిదాన్ని క్షమించమన్నాడు. రంగనాథుల ఆన సవినయంగా చెప్పాడు.

తిరుపాణార్ ఆశ్చర్యపడ్డాడు. "స్వామీ! మీరు నాకు సాష్టాంగ నమస్కారం చేయడం సరికాదు. నేను ఆలయప్రవేశఅర్హత లేనివాణ్ణి. నేను నా పాదాలతో ఆలయంలో అడుగుపెట్టి మలినం చేయడం నాకిష్టం లేదు" అన్నాడు. మీరు నడచిరావడానికి ఇష్టపడకపోతే "నా భుజాలపై ఎక్కి రండి. రాక తప్పదు. ఇది రంగేశుని ఆన" అన్నాడు.

పాణార్ అంగీకరించాడు. సారంగముని భుజాలపై ఎక్కాడు. ఈ దృశ్యాన్ని చూచి, శ్రీరంగవాసులు దిగ్భ్రాంతులయ్యారు. ఇద్దరు ఆలయంలోకి అడుగుపెట్టారు.

పాణార్ రంగనాథునిపాదాదికేశ పర్యంతం దర్శిస్తూ పాశురాలు పాడాడు. స్వామి అందరు చూస్తుండగా పాణార్‌ను తనలో లీనం చేసుకున్నాడు. గానం ఆత్మానందాన్ని మాత్రం ప్రసాదించదు. భక్తుడు అలౌకికమైనఆనందాన్ని భగవత్కృపతో అనుభవిస్తాడనడం సత్యం.



తిరుప్పాణాళ్వారు

కన్నడ హరిదాస వరేణ్యులు

# శ్రీప్రసన్నవేంకటదాసులు

- శ్రీ దేసు వెంకటసుబ్బారావు, 91600 53535

శ్రీప్రసన్నవేంకటదాసులు బీజపూర్‌జిల్లా, బాగలకోట్ పట్టణవాసి.

చిన్నతనంనుంచి పురందరదాసులవారికీర్తనలను శ్రద్ధగా వింటూ కాలం గడిపే వెంకన్న ఒకనాడు ఊరినుండి కొంతమందియాత్రికులు తిరుపతి వెళ్లుతుంటే వారితో పాటు తిరుపతికి బయలుదేరాడు.

దారిమధ్యలో మంత్రాలయంలో ఆయనకు ఒకనాడు కలలో శ్రీరాఘవేంద్రస్వామి కనిపించి "నీవు తిరుపతికి వెళ్లు. అక్కడ శ్రీనివాసుడు నీ రాకకై ఎదురుచూస్తున్నాడు" అని చెప్పాడు. ఉలిక్కిపడి లేచిన వేంకటదాసు మరల తిరుపతికి ప్రయాణమయ్యాడు. కాలినడకన బయల్దేరి తిరుమల చేరుకున్నాడు. శ్రీవారి దివ్యమంగళవిగ్రహాన్ని దర్శించి పరవశించిపోయాడు.

భక్తులకు ప్రసాదవితరణ చేస్తున్న కొంతమంది హరిదాసులను సమీపించి, వెంకన్న వారితో గొంతు కలిపి వారు పెట్టిన ప్రసాదాన్ని స్వీకరించాడు. అలా రోజూ అక్కడకు చేరినవారితో సంకీర్తనబృందంలో పాల్గొంటూ, వారితో పాటు స్వామిదర్శనం చేసుకుంటూ తిరుమలలోనే నాలుగుసంవత్సరాలున్నాడు.


వెంకన్నకు ఒకనాడు మరలా శ్రీరాఘవేంద్రస్వామి కలలో కనిపించి "వెంకన్నా! నీకు త్వరలో శ్రీనివాసునిదర్శనం కలుగుతుంది" అని చెప్పాడు. ఉలిక్కిపడి నిద్రలేచిన వెంకన్న దివ్యానుభూతిని పొందాడు.

మరునాడు యథావిధిగా శ్రీవారిదర్శనానికి వెళ్ళాడు-వెంకన్న. ఆశ్చర్యం అక్కడ స్వామిచెంత పురందరదాసులవారు హృదయంలో శ్రీనివాసుడు కనిపిస్తుండగా దగ్గరకు పిలిచి, తంబూర ఇచ్చి చిరునవ్వు నవ్వుతూ నాలుక చాపమని "ప్రసన్న వేంకట" అనే బీజాక్షరాలు రాసి శ్రీనివాసునిలో

ఐక్యమయ్యాడు. నోట మాటరాలేదు-వెంకన్నకు. అంతా మాయగా కనిపించింది. ఏమి జరుగుతుందో అర్థం కావటం లేదు. శ్రీనివాసునికటాక్షం లభించింది. ఆనందపరవశుడయ్యాడు-వెంకన్న. అసంకల్పితంగా శ్రీనివాసుని తంబూర మీటుతూ గానం చేస్తూ ఆలయం బయటకు వస్తున్నాడు. యాత్రికులు, ఆలయ సిబ్బంది ఆశ్చర్యపోతున్నారు. అంతా కలగా ఉంది.

నిన్న మొన్నటివరకు నిశ్శబ్దంగా స్వామిదర్శనం చేసుకొని వెళ్ళే సామాన్యుడు ఇలా తంబూరా మీటుతూ శ్రీహరిని గానం చేస్తుండటం చూస్తూ, గానం వింటూ మైమరచిపోతున్నారు- అక్కడివారంతా.

అంతా శ్రీమన్నారాయణుని దయ. తనను తాను మైమరచిపోతూ గానం చేస్తూ, నృత్యం చేస్తూ పరవశించి పోతున్న వేంకటదాసుని చూచి, ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. శ్రీనివాసుని మహిమను వేనోళ్ళ పొగొడుతున్నారు.



ఆలయమహంతు శ్రీవారి ఆజ్ఞానుసారం వేంకటదాసుకు తగిన వసతి ఏర్పాటు చేశాడు. నిత్యగాన వాహినిలో తిరుమలలో ప్రతిరోజు ప్రసన్నవేంకటదాసు శ్రీవారిని సేవిస్తూ తరింపసాగాడు.

కొంతకాలానికి తన సోదరునిఅభ్యర్థనమేరకు స్వస్థలం బాగల్‌కోటకు చేరుకొని నిత్యం హరిసంకీర్తనలతో వీధి వీధి తిరుగుతూ భక్తిప్రచారం చేశాడు.


చిత్ర కథ


# పద్మసరోవరం

కథ-డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు-కె. ద్వారకనాథ్

శ్రీనివాసుడు సువర్ణముఖీనదీతీరానికి వెళ్లాడు. అక్కడ శుకమహర్షి ఆశ్రమానికి సమీపంలో స్వయంగా ఆయనే ఒక సరోవరాన్ని తవ్వాడు. తర్వాత స్వామి...




ఆ సరోవరంలో సువర్ణకమలాల్ని స్వయంగా నాటాడు శ్రీనివాసుడు
నేను నాటిన ఎనిమిది పద్మాలు వేయి పద్మాలుగా విస్తరించాయి.
సరోవరానికి తూర్పున సూర్యుణ్ణి ప్రతిష్ఠించాడు శ్రీనివాసుడు
భాస్కరా! ఈ సరోవరానికి నువ్వే రక్షకుడివి
మీ ఆజ్ఞ
ఆ సరోవరంలో స్నానం చేస్తూ, మూడువేలసార్లు మహాలక్ష్మీ మంత్రజపం చేస్తూ, వేయిబంగారు పద్మాలతో ఆమెను అర్చిస్తున్నాడు- శ్రీనివాసుడు. ఆవుపాలనుమాత్ర వేే ఆయన ఆహారంగా స్వీకరిస్తున్నాడు. పుష్కర కాలం గడిచింది. స్వామి దగ్గరికి నారదమహర్షి వచ్చి...
స్వామీ! తపస్సువల్ల మీరు బాగా కృశించిపోయారు. తపస్సును ఆపవచ్చు కదా!
ఆమె కరుణించేవరకూ నేను తపస్సును ఆపను


తర్వాత శుకమహర్షి ఇతరమునులూ వచ్చి, శ్రీనివాసుణ్ణి పరామర్శించారు.
స్వామీ! తమరు తపస్సును విరమించండి
ఆమె నన్ను కరుణించిన తర్వాతే తపస్సును మానుతాను
మునులు పాతాళంలో ఉన్న మహాలక్ష్మి దగ్గరికి వెళ్లి....
మహాలక్ష్మీ! మీ కోసం స్వామి కఠోర తపస్సు చేస్తున్నారు. అలకమాని, పద్మసరోవరానికి తరలిరా తల్లీ!
కపిలమహర్షి కూడా మహాలక్ష్మికి నచ్చజెప్పాడు. అప్పుడు...
సరే.. మీ కోరికను మన్నించి వస్తున్నాను


కార్తికమాసం.. శుద్ధపంచమి.. ఉత్తరాషాఢ.. శుక్రవారం...
అమృతఘడియల్లో పద్మసరోవరంలో మునుల సమక్షంలో...
అదుగో వేయిరేకుల పద్మం వికసించింది...
అందులోంచి స్వర్ణరథాన్ని
అధిరోహించి సిరులతల్లి....
స్వామి చెంతకు చేరి
పూలహారం మెడలో వేసి
నమస్కరిస్తోంది అనురాగవల్లి....
స్వామీ!
నా ప్రణతులందుకోండి!
దేవీ! నా వక్షఃస్థలమే
నీ స్థిర నివాసం
వ్యూహలక్ష్మిగా
శ్రీవారి హృదయపీఠం
మీద
ఆసీనురాలయింది
మహాలక్ష్మి!
వచ్చే సంచికలో... మరో దివ్యలీలా విలాసాన్ని దర్శించి.. తరిద్దాం!
స్వస్తి!




# మాటే మంత్రం

– ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి, 94414 93777

కం. తనువున విరిగిన అలుగుల
నునువున పుచ్చంగ వచ్చు నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
వినుమెన్ని యుపాయములను వెడలునె అధిపా!

శరీరంలో గుచ్చుకున్న బాణాలమొదళ్లలోని మొనదేలిన ఉక్కు ముక్కల్ని ఒకే ఒక్కఉపాయంతో తీసివేయవచ్చు. అత్యంతనిష్ఠురంగా మనసులో నాటుకుపోయినమాటలు ఎన్ని ఉపాయాలతోనైనా బయటికి వస్తాయా?

శత్రువీరులకు వెన్నిచ్చిపారిపోకుండా, ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి, పోరాడేవీరులకు సంబంధించింది– ఇందులో తొలి సగభాగం. యుద్ధరంగంలో శరీరంలో గుచ్చుకుని, విరిగి అందులోనే ఉండిపోయిన బాణాల పదునైన ఉక్కుతునకల్ని వైద్యనిపుణుల సహాయంతో వెతికి పట్టి, వెలికితీయవచ్చు, అదేమంత పెద్దపనికాదు. అయితే వ్యథ కలిగించేవిధంగా మనసులో గాఢంగా నాటుకుపోయినమాటల్ని– ఈటెల వంటిమాటల్ని– శతవిధాలుగా ప్రయత్నించినా బయటికి తీయడానికి వీలుకాదు.

శరీరాన్ని చేతితోనో కాదంటే ఏదైనా సాధనంతోనో కొట్టవచ్చు, గాయం చేయవచ్చు. కానీ మనసునుమాత్రం వాటితో వేటితోనూ కొట్టలేం, గాయపరచలేం. మనసును కొట్టడానికి మామంచిసాధనం మాట. అందుకే "మనిషికొకమాట, గొడ్డుకొకదెబ్బ" అనే సామెత పుట్టింది.



మనసుకు, మాటకు విడదీయరానిఅనుబంధం. ఇష్టమైనమాటవింటే ఎంతో పులకించిపోయేమనసు, కష్టమైనమాట వింటే కటకటపడి పోతుంది, విలవిలలాడిపోతుంది.

ఇతరులశరీరాలకు ఇబ్బంది కలిగించడం తప్పనిసరి అయినా, ఇతరుల మనసులకుమాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది కలిగించ కూడదనేది సారాంశం.

'మనమున నాటినమాటలు' అనే శబ్దసంయోజనంద్వారా మనసు లోకి, లోలోపలికి మాటలు చొచ్చుకుపోతున్నట్లు ధ్వనించే ప్రయోజనాన్ని సాధించాడు- కవిబ్రహ్మ.

# విశిష్టబాలిక



**పేరు** - ఎస్.భవ్య
**పుట్టిన తేది** - 14-01-2009
**తల్లిపేరు** - శ్రీమతి స్మిత
**తండ్రిపేరు** - శ్రీ పి.గిరీష్ చంద్రన్
**తరగతి** - 7వ తరగతి
**పాఠశాల పేరు** - సర్వోదయవిద్యాలయ, నలన్చిర, తిరువనంతపురం, కేరళ.
**అభినివేశం** - శాస్త్రీయసంగీతం, శాస్త్రీయనృత్యం (భరతనాట్యం, కూచిపూడి) భగవద్గీతశ్లోకపఠనం.

పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు చిరంజీవి భవ్య చిన్నతనంలోనే భారతీయనృత్యం, సంగీతకళలపట్ల అభిరుచి పెంచుకుంది. తన అయిదవ ఏటనే శ్రీమతి లక్ష్మీశుభ దగ్గర శాస్త్రీయసంగీతాన్ని నేర్చుకోవడం ప్రారంభించింది. అప్పటినుండే వేదికలమీద భజన సంగీతంలో గాయనిగా ప్రదర్శనలిస్తూ వచ్చింది.

తన పదవయేట శ్రీజ్యోతి కుమార్, శ్రీమతి ఆశ ఎస్.దేవ్ గార్ల దగ్గర శాస్త్రీయసంగీతంలో సుశిక్షితురాలైంది. 2018వ సంవత్సరంలో వారిపాఠశాలలో జరిగిన లలితసంగీతం పోటీలలో ప్రథమబహుమతి గెలుచుకుంది.

శ్రీమతి శ్రీప్రియ దగ్గర ఈ చిన్నారిభరతనాట్యం, కూచిపూడి నృత్యాలను నేర్చుకుంది. 2019వ సంవత్సరంలో నవరాత్రిపర్వదినాలలో అత్తుక్కళ్ దేవిఆలయంలో అరంగేట్రం చేసింది.

శ్రీమతి లక్ష్మీశుభ ఆధ్వర్యంలో ఈ చిన్నారి భగవద్గీతశ్లోక పఠనంలోకూడా ప్రావీణ్యం సంపాదించుకుంది.

# క్విజ్

నిర్వహణ- డా॥ కంపల్లె రవిచంద్రన్



**1) శ్రీమహాభారతానికి లేఖకుడు**

అ) ఆంజనేయుడు  ఆ) వినాయకుడు
ఇ) కుమారస్వామి  ఈ) శ్రీకృష్ణుడు

**2) పరీక్షిత్తును శపించిన ఋషి**

అ) వశిష్టుడు  ఆ) శృంగి
ఇ) విశ్వామిత్రుడు  ఈ) నారదుడు

**3) పరమేశ్వరుని ధనుస్సు**

అ) పాంచజన్యం  ఆ) పినాకం
ఇ) దేవదత్తం  ఈ) కచ్ఛపి

**4) శ్రీకృష్ణునిశంఖం**

అ) పినాకం  ఆ) పాంచజన్యం
ఇ) దేవదత్తం  ఈ) కచ్ఛపి

**5) సరస్వతివీణ**

అ) పినాకం  ఆ) కచ్ఛపి
ఇ) దేవదత్తం  ఈ) పాంచజన్యం

**6) నారదునివీణ**

అ) పినాకం  ఆ) మహతి
ఇ) దేవదత్తం  ఈ) పాంచజన్యం

**7) పరమశివుడు అర్జునునకు ఇచ్చినఅస్త్రం**

అ) పినాకం  ఆ) పాశుపతం
ఇ) దేవదత్తం  ఈ) పాంచజన్యం


---

జవాబులు

1) ఆ 2) ఆ 3) ఆ 4) ఆ 5) ఆ 6) ఆ 7) ఆ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



నంపాడువాన్

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-10-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742,
Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

